క్లుప్తంగా

మురుగు డ్రెయిన్ల క్లీనింగ్



సాక్షి ఎఫెక్ట్

మోపిదేవి: మోపిదేవి గ్రామ పంచాయతీలో ప్రధాన మురుగు డ్రెయిన్లను గురువారం క్లీనింగ్ చేశారు. ఈ నెల 22వ తేదీ సాక్షి దినపత్రికలో 'సమన్వయ లోపం.. మోపిదేవికి శాపం' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రధాన మురుగు డ్రెయిన్లు బాగుచేయించారు. చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్



పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన సెషన్‌లో 175 మందికి గాను 165 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 177 మందికి గాను 171 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు సోదరుడు శ్రీమన్నారాయణ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి జయగోపాల్, న్యాయవాది బీవీ శేషగిరిరావు, సింహాద్రి ప్రభాకర్, మురళి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



కోనేరుసెంటర్: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని పేర్కొన్నారు. మండలంలోని చిట్టిపాలెంలో గురువారం రైతులకు 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ జీలుగు విత్తనాలు భూసారం పెంచేందుకు దోహదపడతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, జవల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

వైరల్ జ్వరాలతో ఆందోళన

బంటుమిల్లి: మండలంలోని చోరంపూడి గ్రామంలో వైరల్ జ్వరాలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు గ్రామంలో సరైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఆర్‌ఓ ప్లాంటు నీటినే కొని తాగుతున్నారు. పంచాయతీ సరఫరా చేసే నీరు కలుషితంగా ఉండటంతో గృహావసరాలకు వాడుకుంటున్నారు. కొద్ది రోజులుగా వైరల్ జ్వరాలతో ఉన్న రోగులు బందరు, పెడనకు వెళ్లి మెరుగైన వైద్యం పొందుతున్నారు. కొంత మంది ఆర్‌ఎంపీ వైద్యులతో ఇళ్ల వద్దనే చికిత్స పొందుతున్నారు. పంచాయితీ, వైద్య సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లండన్ డెప్యూటీ మేయర్ ఉదయ్ ఆరేటికి శుభాకాంక్షలు



అవనిగడ్డ: లండన్‌లోని రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్‌టన్ డెప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఉదయ్ ఆరేటికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. లండన్ డెప్యూటీ మేయర్‌గా ఎన్నికైన తొలి భారతీయుడిగా ఉదయ్ ఆరేటి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఉదయ్ 2018లో సెంట్రల్ లండన్ కెన్సింగ్‌టన్‌కు మొదటి భారతీయ కౌన్సిలర్(ఎమ్మెల్యేకు సమానమైన) హోదా పొందారని పేర్కొన్నారు.

అడ్డగోలు పార్కింగ్‌తో ప్రమాదాలు



చల్లపల్లి-పామర్రు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద అడ్డగోలుగా నిలిపివున్న వాహనాలు

చల్లపల్లి: చల్లపల్లి-పామర్రు రోడ్డులోని ఎన్టీఆర్ పార్కు వద్ద పెట్రోల్ బంకు ఆవరణలో అడ్డగోలుగా నిలిపి ఉంచిన వాహనాలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరికివారు తమ వాహనాలు రోడ్డు మార్జిన్ వరకూ నిలిపి ఉంచి నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో ఆ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. పెట్రోల్ బంక్‌కు తూర్పు వైపున చల్లపల్లి-పామర్రు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు, దక్షిణం వైపున చల్లపల్లి-నడకుదురు ఆర్‌అండ్‌బీ రహదారులు ఉన్నాయి. రెండు రోడ్లు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. కార్నర్‌లో ఉన్న పెట్రోల్ బంకులో విచ్చలవిడిగా లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, పొక్లెయిన్‌లు, జేసీబీలు, ఆటోలు అధిక సంఖ్యలో నిత్యం ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు.

ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు

అడ్డగోలుగా వాహనాలను పార్కింగ్ చేయడంతో పామర్రు వైపు నుంచి వచ్చే వాహనాలు నడికుదురు రోడ్డు వైపునకు తిరగాలన్నా, అలాగే నడికుదురు రోడ్డులో నుంచి పామర్రు రోడ్డు వైపునకు మలుపు తిరగాలన్నా ఎదురుగా ఏయే వాహనాలు వస్తున్నాయో కనిపించక గమనించలేని పరిస్థితి అక్కడ నెలకొంది. దీంతో ఆచితూచి రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో మలుపు తిరిగే సమయంలో ఎదురుగా వేగంగా వచ్చే వాహనాలతో పలువురు ప్రమాదాలకు గురై గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఆదివారం ఇక్కడ చేపల మార్కెట్ కూడా నిర్వహించటంతో ఆరోజు మరింత రద్దీ వాతావరణం నెలకొంటోందని తెలిపారు. ప్రమాదాలకు కారణమయ్యేలా నిర్లక్ష్యంగా వాహనాలు నిలుపుతున్నవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఎన్టీఆర్ పార్క్ ప్రాంతంలో ఎప్పటికప్పుడు గస్తీ ఏర్పాటుచేస్తాం. అడ్డగోలుగా, ప్రమాదకరంగా ఎవరైనా వాహనాలను రోడ్ల మార్జిన్ల వరకూ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలిపి రాకపోకలకు అంతరాయం కల్గించకుండా సహకరించాలి.

– పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, ఎస్ఐ, చల్లపల్లి

ఘనం నాంచారమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



పెదకళ్లేపల్లిలో నాంచారమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న వంగవీటి నరేంద్ర

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి తూర్పు వీధిలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఇక్కడ ఉన్న పురాతన ఆలయాన్ని అన్నిహంగులతో పునర్నిర్మించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి గౌరీశంకర్ కుమార్ బ్రహ్మత్వంలో 11 మంది శిష్య బృందం ఐదు రోజులుగా విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నసమాదన వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ శిఖరాన్ని దాత స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తైలం బ్రహ్మరాజు అందించారు.

అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించిన వంగవీటి నరేంద్ర

నూతనంగా నిర్మించిన ఆలయ పునఃప్రతిష్టా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత గ్రామంలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేశారు. గెట్టా వెంకటరత్నం నాయుడు ఆధ్వర్యంలో సంగం శ్రీనివాసారవు, ఆకుల దుర్గా నాగేశ్వరావు, అనుమకొండ శివ, కార్యకర్తలు, పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ ఆరజా సంధ్యారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, లింగం జగదీష్‌కుమార్, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ పొరిటిగడ్డ రాజబాబు పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లోనూ రాణించాలి

శ్రీకాకుళం(ఘంటసాల): పది ఫలితాల్లోనే కాకుండా ఉన్నత చదువుల్లో కూడా విద్యార్థిని సౌమ్యశ్రీ ప్రతిభ చూపి రాణించి శ్రీకాకుళం గ్రామానికి పేరు తీసుకురావాలని పలువురు వక్తలు కోరారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన కోడి సౌమ్యశ్రీ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదివి, విడుదలైన ఫలితాల్లో 565 మార్కులు సాధించి హైస్కూల్ మొదటి స్థానం, మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో శ్రీకాకుళం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు సౌమ్యశ్రీని రామాలయం వద్ద బుధవారం రాత్రి సత్కరించారు. గ్రామానికి చెందిన గోపు రామాంజనేయులు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో జె.శ్రీనివాస్, జి.రాఘవరాజు, బుజ్జి, దుర్గా నాని, ముదిరాజ్ చంటి, జి.సూరిబాబు, జి.నాంచారయ్య, జి.శివ, సూరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ వైద్య ఖర్చులకు సాయం



అనూషకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ తదితరులు

పెడన: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు స్వచ్ఛంద సంస్థ ద్వారా గురువారం ఆర్థిక సాయాన్ని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వీణం శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన బోదాసు అనూష గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోందని తెలిపారు. ఆమెకు రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో సంబంధిత అధికారుల సాయంతో ఆరోగ్య మిత్ర బెంగళూరు వైద్యాధికారులతో మాట్లాడి సాయం కోరామన్నారు. వారు వైదేహి ఆస్పత్రిలో గుండె మార్పిడి కోసం సిఫార్సు చేశారని తెలిపారు. దీంతో బెంగళూరు ప్రయాణ ఖర్చులకు రూ.10వేలు నగదు, ఇంట్లోకి పచారీ సరుకులు, పండ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సింగరాజు ప్రకాశరావు, కొలుకుల శ్యామసుందరరావు, కమాల్ బాషా, నల్ల సాయిబాబు, పట్టిసపు పవన్ కళ్యాణ్, పిచ్చుక విజయ్, వుమ్మిటి లింగేశ్వరరావు, అతావుల్ల తదితరులు పాల్గొన్నారు.

దళితులను అవమానించిన వారిపై కేసు నమోదు చేయాలి



ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మకు సమస్యను వివరిస్తున్న డీబీపీఎస్ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రకాశం జిల్లా జరుగుమిల్లి మండలం కె బిట్రగుంటలో దళితులను అవమానపరిచిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదుచేసి నిందితులను అరెస్టు చేయాలని దళిత బహుజన పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కె బిట్రగుంట గ్రామంలో అంబేడ్కర్ ఫొటోతో వీధుల్లోకి వచ్చి ఎలా ఊరేగింపు చేస్తారని అసభ్యంగా మాట్లాడారన్నారు. అటువంటి వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. ఎల్ఐసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు పి.శోభన్‌కుమార్, దళిత జేఏసీ కన్వీనర్ జక్కుల ఆనంద్‌బాబు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు మద్దాల వీరాస్వామి, డీబీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గోని గాంధీ, దాసరి సాంబశివరావు, విజయరాజు పాల్గొన్నారు.

దాతల సహకారంతో శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికలో పొక్లెయిన్‌తో జంగిల్ క్లియరెన్స్ పనులు

కోడూరు: కోడూరు నరసింహపురం రహదారిలోని శ్మశానవాటికను దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నారు. మండలంలోని పలువురు ప్రముఖులు అభివృద్ధి కమిటీగా ఏర్పడి ఈ పనులను చేయిస్తున్నారు. శ్మశానవాటిక లోపల భాగంలో ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో పాముల సంచారం అధికమైయింది. దీంతో స్పందించిన దాతలు శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చారు. సుమారు రూ.6 లక్షలతో పనులు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా తొలుత పొక్లెయిన్, జేసీబీల సాయంతో శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. హిందువుల శ్మశానవాటికతో పాటు క్రైస్తవుల శ్మశానవాటికలో కూడా అభివృద్ధి పనులు చేపట్టి రహదారి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. శ్మశానవాటికలో రూ.40 వేలతో మెరక పనులు చేయించారు.



పిండివారిపాలెంలో హనుమాత్ శోభాయాత్రలో భాగంగా భక్తుల బైక్ ర్యాలీ



చల్లపల్లి-మచిలీపట్నం మార్గంలో హనుమాన్ శోభాయాత్ర



నాగాయలంక కన్యకాంబ ఆలయంలో దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు



ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఘనంగా హనుమజ్జయంతి



లింగారెడ్డిపాలెంలో స్వామికి పూజలు



కంచడంలో పూజలు చేస్తున్న సర్పంచ్ దంపతులు

చల్లపల్లి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ శోభాయాత్ర భక్తి శ్రద్ధలతో సాగింది. చల్లపల్లి-మచిలీపట్నం మార్గంలోని జీలగలగండి వద్ద ఆంజేయస్వామి ఆలయం నుంచి బయలుదేరిన ఈ యాత్ర చల్లపల్లి బస్టాండు వద్ద గల పంచముఖ ఆంజేనేయస్వామి ఆలయం వరకూ సాగింది. విశ్వహిందూ పరిషత్ సభ్యులు అడపా రవి, బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతి సందర్భంగా నగరంలోని పలు ఆలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్థానిక ఈడేపల్లిలో వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి మందిరంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామికి సుందరాకాండ పారాయణాన్ని బ్రహ్మశ్రీ లంకా శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. మెట్టు ఆదిశేషు, కొర్రపాటి శ్రీనివాస్ స్వామికి ప్రత్యేక పూజలు చేసి దండలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు చల్లపల్లి నాగ విష్ణుమూర్తిశర్మ స్వామి పూజలు నిర్వహించారు. బుట్టాయిపేట దత్తాశ్రమంలో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు.

గూడూరులో..

గూడూరు: మండలంలో హనుమజ్జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పోసినవారిపాలెం శివారు పిండివారిపాలెం అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

కోడూరులో..

కోడూరు: కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల్లో గురువారం ఆంజనేయస్వామి జయంతిని ఘనంగా జరిపారు. స్థానిక వంతెన సెంటర్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల వద్ద హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు.

పెడనలో..

పెడన: హనుమజ్జయంతి సందర్భంగా పట్టణంలోని బస్టాండు సెంటరులోని శ్రీవరసిద్ధి వినాయక, ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమంతుని విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పడమట బలరాం, చిరంజీవుతో పాటు సభ్యులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు. బ్రహ్మపురం, చోడదిక్కులలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగాయలంకలో..

నాగాయలంక: మండల పరిధిలోని పలు ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భావదేవరపల్లి అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త మలిశెట్టి సాంబశివరావు(నామాలు)పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ నాంచారయ్యశర్మ బ్రహ్మత్వంలో శ్రీసువర్చలాంజనేయస్వామి కల్యాణం, ఆకుపూజ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, స్థానిక భజన బృందం నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం, అన్నసంతర్పణ జరిపారు. మలిశెట్టి బాలాంజనేయులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ దేవస్థానం ప్రాంగణంలోని శ్రీదాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజ జరిపి గారెలు, అప్పాలు, తోరణాలతో కూడిన మాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆధ్వర్యంలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు పూజాధికాలు జరిపారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి పూజలు గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కంచడంలోని ఆంజనేయస్వామి మందిరంలో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యుడు, బందారు చంద్రశేఖర్ దంపతులు జయంతి పూజలు నిర్వహించారు. పాశ్చాపురంలోని సువర్చలాంజనేయస్వామి ఆలయంలో 45 రోజులుగా జరుగుతున్న హనుమాన్‌చాలీసా పారాయణం జయంతి సందర్భంగా ముగిసింది. పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, డీవీ మేఘనరసింహాచార్యులు శిష్య బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

మోపిదేవిలో..

మోపిదేవి: హనుమజ్జయంతి సందర్భంగా గురువారం పెదకళ్లేపల్లి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జ్యోగి ప్రవీణ ఆధ్వర్యంలో ఉదయం తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆడపావారిపాలెం ఆంజనేయస్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు పండలనేని శివప్రసాద్ ఆధ్వర్యంలోనూ, పెదకళ్లేపల్లిలో సాయంత్రం సంగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. మెరకనపల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయంలో హిందూ ధర్మ పరిషత్, టీటీడీ మన గుడి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, కలారి రామారావు, రాజేష్, మాజీ సర్పంచ్ రాజబాబు పాల్గొన్నారు.

మారుమోగిన హనుమాన్ నామస్మరణ

చల్లపల్లి: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం వాడ వాడలా హనుమత్ నామస్మరణ మారుమోగింది. రామాలయాల వద్ద, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. స్థానిక బస్టాండు సెంటర్లోని పంచముఖ ఆంజనేయస్వామి గుడివద్ద, నారాయణరావునగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద, పడమర వీధిలోని తాళ్ల రామాలయం తదితర ఆలయాలను అలంకరించి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. పలువురు భజన సమాజ బృందాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఘంటసాలలో..

ఘంటసాల: హనుమజ్జయంతి వేడుకల సందర్భంగా గురువారం ఘంటసాల, శ్రీకాకుళం, గోగినేనిపాలెంతో పాటు మిగిలిన గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోగినేనిపాలెం ఎస్సీకాలనీలో జరిగిన హనుమజ్జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత ఘట్టమనేని మారుతీ ప్రసాద్-రుక్మిణి, సాయి-రజిత, అబ్బూరి నాగార్జున-రాజేశ్వరి దంపతులు కల్యాణం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. శ్రీకాకుళంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసంతర్పణ చేశారు. ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు, కూటమి నేతలు కె.తాతయ్య, కె.కోటి, కె.కృష్ణమూర్తి, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

స్వామికి వెండి తమలపాకుల మాల

కృత్తివెన్ను: శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గాంధీనగరంలోని అభయాంజనేయస్వామికి స్థానిక భక్తులు వెండితో తయారు చేసిన తమలపాకుల మాలను గురువారం బహూకరించారు. గురువారం దాసరి కృష్ణ, నాగరాణి దంపతులు రూ.60 వేలు విలువ కలిగిన ఈ మాలను స్వామికి వేశారు. వీరిని నిర్వాహకులు సత్కరించారు.

ఘనంగా ఉత్సవాలు

మండలంలోని గాంధీనగర్, నీలిపూడి, సంగమూడి గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అడ్డపర్ర ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దర్శించుకున్నారు. అడ్డపర్ర, యండపల్లి గ్రామాల్లో అన్నసమారాధనలు జరిగాయి.



పెడన బస్టాండు సెంటరు వద్ద ఆంజనేయస్వామిని దర్శించుకున్న భక్తులు



పాశ్చాపురంలోని ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు



గాంధీనగరంలో స్వామికి వెండి తమలపాకుల మాల వేస్తున్న భక్తులు



పెదకళ్లేపల్లిలో ఆంజనేయస్వామి ఊరేగింపు



గోగినేనిపాలెంలో హనుమజ్జయంతిలో మారుతీ ప్రసాద్, సాయి, నాగార్జున దంపతులు

ఆర్‌యూబీల నిర్మాణానికి ప్రాథమిక సర్వే



పెడన: పట్టణంలోని రెండు ప్రధాన రైల్వేగేటుల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)లను నిర్మించేందుకు ప్రాథమిక సర్వేను స్థానిక అధికారులు చేపట్టారు. ప్రాథమిక సర్వేలో భాగంగా రైల్వే శాఖ అందజేసిన కొలతలు మేరకు మండల, పట్టణ సర్వేయర్లు దాస్, నాగరాజులు తమ సిబ్బందితో గురువారం కొలతలు వేసి మార్కింగ్ చేశారు. టీపీఓ బి.సుగుణకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు జితేంద్ర, ప్లానింగ్ కార్యదర్శులు ప్రాథమిక సర్వేలో పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు కమిషనర్ అభినందన



పెడన: కృష్ణా ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ ద్వారా ఏలూరు పరిషత్‌లో ఈ నెల 18న జరిగిన నాటక ప్రదర్శనలో పెడన మున్సిపల్ మేనేజర్ ఎంఆర్‌వీఆర్ ప్రసాద్(మట్టా రాజా)కు ప్రత్యేక జ్యూరీ బహుమతి రావడంపై గురువారం కమిషనర్ ఎం.గోపాలరావు తన చాబరులో రాజాను అభినందించారు. టీపీఓ బి.సుజనకుమారి, ఆర్ఐ వెంకటేశ్వరరావు తదితర ఉద్యోగులు అభినందించిన వారిలో ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



పెడన: మండలంలో ఈ ఏడాది మార్చిలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన జూనియర్ లైన్‌మన్ గ్రేడ్–2 ధరవాతు గోపాలరావు కుటుంబానికి విద్యుత్‌శాఖ ఉద్యోగులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మచిలీపట్నం సర్కిల్ అధికారులు, డివిజన్ కార్మిక సంఘ నాయకులు, సోదరులు, సిబ్బంది రూ.4,56,500ను వసూలు చేసినట్లు పెడన ఏడీఈ సీహెచ్ మాణిక్యలరావు తెలిపారు. వీటిలో ఆస్పత్రి ఖర్చులు చెల్లింపులు చేయగా మిగిలిన రూ.2,06,500ను గోపాలరావు భార్య నాగరాణికి కార్మిక సంఘ నాయకుల సమక్షంలో అందజేసినట్లు ఏడీఈ తెలిపారు.

కాళేశ్వరం పుష్కరాలకు బయలుదేరిన ఆర్టీసీ బస్

అవనిగడ్డ: తెలంగాణాలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి తొలి బస్ గురువారం బయలు దేరి వెళ్లింది. డిపో మేనేజర్ కె హనుమంతరావు జెండా ఊపి ఈ బస్‌ను ప్రారంభించారు. ఈ సర్వీసును ఆదరించిన ప్రయాణికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

గూడూరు: కంకటావ-కత్తులవానిపాలెం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరికి విజ్ఞప్తి చేశారు. గురువారం మచిలీపట్నంలో ఎంపీని కలసిన గ్రామస్తులు వంతెన కూలిపోవడం వల్ల ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎంపీ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు శీరం సంతోష్, బూరగడ్డ భాను, సమ్మెట గణపతిరావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం తెలిపారు.